క్లుప్తంగా

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు


ర్యాలీ చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మందస: ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు పొంచిఉందని వక్తలు అన్నారు. మండలంలోని డబారు, పుచ్చపాడు, వీరగున్నమ్మపురం గ్రామాల్లో ప్లాస్టిక్‌తో అనర్థాలపై ఆదివారం జాతీయ సేవాపథకం వలంటీర్లు అవగాహన కల్పించారు. భూగర్భ జలవనరులకు నష్టం కలుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ బొంగి ప్రవీణ్, పీవోలు కృష్ణారావు, సోమేశ్వరరావు, రవిశంకర్ పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం


పుణ్యవతికి సాయం అందజేస్తున్న స్నేహితులు

ఇచ్ఛాపురం: క్యాన్సర్ బారిన పడి వైద్యం చేసుకునే స్థోమత లేక బాధపడుతున్న స్నేహితురాలికి చిన్నప్పటి మిత్రులు అండగా నిలిచారు. గొల్లవీధిలో నివాసముంటున్న డబ్బీరు పుణ్యవతి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఏయూపీ పాఠశాలలో 1986 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 20 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని పుణ్యవతి ఇంటికి ఆదివారం వెళ్లి ఆమెకు అందించారు. స్నేహితులు గోపి, శ్రీను, వెంకటరమణ, యోగి, జయ, జన పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


గెలుపొందిన వృద్ధులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల సిబ్బంది

టెక్కలి: మండలంలోని ధర్మనీలాపురం గ్రామంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ..ఎన్‌ఎస్‌ఎస్ శిబిరానికి గ్రామస్తుల నుంచి లభించిన ఆదరణ మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చిన్నారులు, వృద్ధులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో డి.వాసుబాబు, కరుణాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి


ఎంపీపీ నిమ్మన దాస్, నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ గెలుపునకు కృషిచేయాలని టెక్కలి నియోజకవర్గ నాయకుడు పేరాడ రమేష్ స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు. సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, స్థానిక ప్రజా ప్రతినిధులను ఆదివారం రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీని దుశ్శాలువతో సత్కరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, పాడు కామేష్ ఉన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం


సాయాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: బుడ్డేపుపేట గ్రామానికి చెందిన బుడ్డేపు హరికృష్ణ కుమార్తె (పది రోజులు) హృద్రోగంతో బాధపడుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో చిన్నారి వైద్యానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పేటూరు గ్రామానికి చెందిన మృత్యుంజయ ఫౌండేషన్ సభ్యులు రూ. పది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని చిన్నారి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట పూజలు


కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగలో కల్యాణ వెంకటేశ్వర ఆలయ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సుమారు వంద మందితో హరేరామ–హరేకృష్ణ నామ సంకీర్తనలను ఆలపించారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


ఇచ్ఛాపురం రూరల్: ప్రచారంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న పేరాడ రమేశ్

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు చేకూరిన లబ్ధిని చూసి మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి పిరియా విజయ మశాఖపురంలో పర్యటించి ఉపాధి హామీ పథకం వేతనదారులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని సంక్షేమాలను, విప్లవాత్మక పరిపాలను సీఎం జగన్ అందించారని అన్నారు. రెండోసారి కూడా ఆయన్ని ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, చాట్ల తులసీదాసురెడ్డి, రంగాల జానీ, నగిరెడ్ల చిరంజీవి, ఆశి కృష్ణారెడ్డి, రంగాల కృష్ణారెడ్డి, కొయ్య రాజు, పాల దానేశ్, సర్పంచ్ సంతోష్ మండలా, బాకి లక్ష్మీనారాయణ, లోపింటి దీనబందురెడ్డి, సాడి గురుమూర్తి, జోగల దిలీప్, కాళ్ల దేవరాజు, ఇసురు యాదవరెడ్డి, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దాం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని శ్రీకాకుళం పార్లమెంటు అభ్యర్థి పేరాడ తిలక్ సోదరుడు రమేశ్ పిలుపునిచ్చారు. కొళిగాం, కీర్తిపురం, పాయితారి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రెండుసార్లు ఎంపీగా గెలిచిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారన్నార. ఈసారి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేస్తున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, సర్పంచ్‌లు సంతోష మండలా, ప్రియా నాయక్, పాడుగు రంజిత, లోపింటి దీనబందు రెడ్డి, బొబ్బిలి దేవరాజు, పాడుగు రమణ, కృష్ణ మండలా, మురళీ, లోపింటి దుర్యోధన, గండు మహాపాత్రో, గానాల చిరంజీవి ఉన్నారు.

ప్రజా సంక్షేమ, అభివృద్ధి ప్రభుత్వానికి అండగా నిలవండి..

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అండగా నిలవాలని ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పల్లంటి మధుమూర్తి కోరారు. వార్డు పరిధిలోని కొండివీధిలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావుపట్నాయక్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలను కలిసి ఓటును అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా పిరియా విజయ, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు.

కోటబొమ్మాళి: సొడాం పంచాయతీలో పార్టీ శ్రేణులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీగా పేరాడ తిలక్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో మండల పార్టీ కన్వీనర్ నూక సత్యరాజు, మండల ప్రత్యేక ఆహ్వానితులు రోణంకి మల్లేశ్వరరావు, స్థానిక సర్పంచ్ పేడాడ విలాస్, ఎంపీటీసీ సభ్యులు వాన అసిరినాయుడు, బొడ్డు అప్పన్న, బగాది దివాకర్, పి.సత్యం, బొడ్డు చెంచులు, కొండాల శిమ్మయ్య, నేతింటి సింహాచలం, పంగ చందరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ జి.నాగభూషణరావు, నాయకులు గురువెల్లి కేశవరావు, సుంకరి జనార్దన, పేడాడ వెంకటరావు ఉన్నారు.

పలాస: డాక్టర్ సీదిరి అప్పలరాజును ఎమ్మెల్యేగా, పేరాడ తిలక్‌ను ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నాయకులు కోరారు. అమలకుడియా, తర్లాకోట పంచాయతీల్లో ప్రచారం చేశారు. పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, జేసీ కన్వీనరు దువ్వాడ రవి, అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, కొర్ల మురళీకృష్ణ చౌదరి, జి.మోహనరావు, చింతాడ మాధవరావు, కొర్ల సంతోష్ ఉన్నారు.

మందస: తాళ్లగురంటి పంచాయతీ ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని గిరిజన గ్రామాలైన కుల్లాడి, అంబటికంబారం, టిక్కరపడ, తాళ్లగురంటిల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌చార్జి దల్లి జానకీరావురెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ అందాల శేషగిరిరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్‌పాణిగ్రాహి, సర్పంచ్ సవర బసంతి, ఎంపీటీసీ సభ్యుడు నల్ల అనితచౌదరి, నాయకులు నల్ల భాస్కరరావు, రామచంద్రబెహరా, కలియాగౌడ, సవర అక్షయ్‌కుమార్, శివాజీ, నల్ల రమేష్, అర్జున్‌బిస్వాల్ ఉన్నారు.

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి తాళ్లబద్రలో నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్యవిభాగ అధ్యక్షులు, కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, స్థానిక కౌన్సిలర్ కర్రి మాధవరావు, నాయకులు నీలాపురం నారాయణ, రమణ, బమ్మిడి శశి ఉన్నారు.


ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న పిరియా విజయ


మందస: అంబటికంబారంలో ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు


ఇచ్ఛాపురం: ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ మధు మూర్తి తదితరులు


కోటబొమ్మాళి: ఇంటింట ప్రచారం చేస్తున్న నాయకులు


పలాస: అమలకుడియాలో ప్రచారం చేస్తున్న దృశ్యం


కాశీబుగ్గ: ఓటును అభ్యర్థిస్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీలో 80 కుటుంబాలు చేరిక


మంత్రి అప్పలరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ప్రకాశ నగర్, ఇందిరనగర్, గణేష్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 80 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరాయి. పార్టీ యువజన నాయకుడు పైల వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో ఎక్కువమంది మహిళలు ఉండడంపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ చేరిన వారు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యనాయకుడు అల్లు వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ బల్ల శ్రీనివాసరావు, అంకుల సారధి, మామిడి ఈశ్వరరావు, సురేష్, మోసిన్, డాక్టర్ ప్రిన్సెస్ పట్నాయక్ ఉన్నారు.

రాజమ్మతల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు


భక్తులకు దర్శనమిస్తున్న రాజమ్మ తల్లి

గార: వత్సవలసలో కొలువున్న రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు చివరి వారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు బసచేసి రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి) పాటు భూలోకమ్మ తల్లికి ఆదివారం ఉదయం మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలు ఆచరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి ఇక్కడే వంటలు చేసుకొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అదేవిధంగా భూలోకమ్మను దర్శించుకున్నారు. ఉత్సవంలో కోళ్లు, గొర్రెలు సమర్పించడంతో పాటు కానుకలు అధికంగా భక్తులు ముట్టజెప్పారు. వన్‌వే ట్రాఫిక్‌ను పోలీసులు అమలు చేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పాయి. వన్‌టౌన్ సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై కె.కృష్ణప్రసాద్‌లు బందోబస్తు పర్యవేక్షించారు.

నేడు లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవం

కంచిలి: జె.నారాయణపురం గ్రామంలోని లక్ష్మీ నారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి వివిధ పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. సామూహిక కుంకుమార్చన, నారాయణ హోమం, అన్నసమారాధన, భజనా కాలక్షేపం, సాయంత్రం స్వామి వారి కల్యాణ మహోత్సవం, స్వామివారి తిరువీధి మహోత్సవం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 26వ తేదీ ఉదయం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఐవీఎఫ్, స్త్రీ, ప్రసూతి పరీక్షలు చేయనున్నట్టు పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అన్నెపు సుశీల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ కేటీరోడ్డులో ఉన్నటువంటి బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ వెనుక ఉన్న మమత తల్లీబిడ్డల ఆస్పత్రి ఆవరణలో నిర్వహించనున్న శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన పెరుమాళ్ల స్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చక బృందం

కవిటి: బెజ్జిపుట్టుగ గ్రామంలోని చక్రధర పెరుమాళ్ల స్వామి ఆలయంలో ద్వితీయ బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ముగిశాయి. చివరి రోజైన ఆదివారం ఉదయం అవబృద, చక్రస్నానం, ధ్వజావరోహణం, మహాపూర్ణాహుతి, మహా నివేదన, మంగళాశాసనం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగం, ఉంజాల సేవ, ద్వాదశారాధన, రుత్విక్ సన్మానం, ఉత్సవ విజర్జన నీరాజనం జరిగింది. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

విజయాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణకుమారి

కాశీబుగ్గ: విద్యార్థులు విజయాన్నే లక్ష్యంగా పెట్టుకోవాలని కాశీబుగ్గ ఇస్కాన్ సాధువల బృందం సభ్యులు అన్నారు. దేనైనా సాధించాలంటే ప్రయత్నలోపం ఉండకూడదని.. మధ్యలో ధైర్యం కోల్పోకూడదని చెప్పారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడోవార్డు పరిధి పెంటిపద్ర గిరిజన గ్రామంలో ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా నిర్వహించిన సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవా గుణాన్ని అలవర్చుకోవడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రవీణకుమారి, పీవోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


క్రిస్టియన్ వర్‌షిప్ సెంటర్‌లో మట్టల ప్రదర్శన


కీస్టోన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసు ప్రభువును శిలువ చేసిన గుడ్‌ఫ్రైడే ముందు వచ్చే ఆదివారం దీన్ని జరుపుకోవడం ఆనవాయితీ. శ్రీకాకుళం చిన్న బజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు శిలువ చేయడంపై చర్చి పాదర్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ కె.జెస్ ప్రేమ్‌కుమార్, డీఎల్‌బీఎల్ కుమార్, వై.జీవన్, వై.సునీల్, ఎల్.చిట్టిబాబు, పాల్ పాల్గొన్నారు. అలాగే కీస్టోన్ చర్చిలో పాస్టర్ జోయల్ ఆధ్వర్యంలో ఈత ఆకులతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళా కళాశాల రోడ్డులోని క్రిస్టియన్ వర్‌షిప్ సెంటర్ ఆధ్వర్యంలో కూడా ఈత ఆకుల ప్రదర్శన, ప్రార్థనలు జరిగాయి. జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న ట్రినిటీ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ జాకబ్ అధికారి ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు ఈత ఆకులతో ర్యాలీ నిర్వహించారు. అఫీషియల్‌కాలనీలో ఉన్న సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో చర్చి పాదర్ ప్రభాకర్ ఉన్నారు. పాత శ్రీకాకుళంలోని ఆంధ్రా బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ డాక్టర్ రెవరెండ్ లోపింటి ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. హౌసింగ్ బోర్డు కాలనీలోని అప్పర్ రూం చర్చి పాస్టర్ కె.సుజ్ఞానరావు, కె.వెస్లీ సుజ్ఞాన్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఆరాధన గీతాలను ఆలపించారు.


ట్రినిటీ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ


అప్పర్ రూం చర్చి ఆధ్వర్యంలో..

డ్రైవర్లకు భరోసా ‘వాహనమిత్ర’

- ఏటా రూ. 10 వేల సాయం
- టెక్కలిలో 2,390 మందికి రూ. 7.83 కోట్ల లబ్ధి

టెక్కలి నియోజకవర్గంలో ఇలా..

వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా టెక్కలి నియోజకవర్గంలో సుమారు 2,390 మంది డ్రైవర్లకు సుమారు 7,83,16,543 రూపాయల మేరకు ఆర్థిక సాయం అందజేశారు.

అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు అండగా నిలుస్తామని ప్రజా సంకల్ప పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీకి రూపకల్పనే ‘వైఎస్సార్ వాహనమిత్ర’ పథకం. దీని ద్వారా ఆటో, ట్యాక్సీలను నడుపుతున్న డ్రైవర్లకు ఏటా రూ. పది వేల సాయం అందజేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం డ్రైవర్లను పట్టించుకునే దాఖలాలు లేవు. మొట్టమొదటిసారిగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి 2019 అక్టోబర్ నెలలో శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా అందుతున్న సాయంతో వాహనాలకు బీమా, ఫిట్‌నెస్, పొల్యూషన్, బ్రేక్‌తో పాటు ఇతర ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గతం ఇదే అవసరాలకు డ్రైవర్లు అప్పులు చేసి ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు వాహనమిత్ర పథకం ద్వారా వచ్చిన డబ్బులు వారికి భరోసాగా నిలుస్తున్నాయి.

–టెక్కలి


టెక్కలిలో ఆటో స్టాండ్

అప్పల బాధలు తప్పాయి



గతంలో ఆటోకు ఇన్సురెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్, బ్రేక్‌తో పాటు మరికొన్ని అవసరాలకు ఏటా అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు అటువంటి ఇబ్బందులు లేకుండా వైఎస్సార్ వాహనమిత్ర పథకం మమ్మల్ని ఆదుకుంటోంది. ఇంతకు మునుపెన్నడూ లేని విధంగా మాలాంటి ఆటో డ్రైవర్ల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఆలోచన చేశారు.

–బి.తేజారావు,
ఆటో డ్రైవర్, టెక్కలి.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారు:



అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు అండగా నిలుస్తానని జగనన్న హామీ ఇచ్చారు. మాటకు కట్టుబడి గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మా డ్రైవర్ల కోసం వైఎస్సార్ వాహనమిత్ర పథకంతో ఏటా రూ.10 వేలు ఇస్తున్నారు. వీటితో వాహనానికి అవసరమైన ఫిట్‌నెస్, బీమా చేయించుకుంటున్నాం. గతంలో ఆర్థిక ఇబ్బందులతో వీటి కోసం ఇబ్బందులు పడేవాళ్లం. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటాం.

–కె.చిన్నారావు,
ట్యాక్సీ డ్రైవర్, టెక్కలి.